

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయం

● ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేయడం అభినందనీయమని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. త్వరలో జరుగనున్న పదో తరగతి పరీక్షల నేపథ్యంలో వరల్డ్ విజన్ సంస్థ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల కోసం స్టడీమెటీరియల్‌ను ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుల విషయంలో ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పోటీ పడుతున్న ప్రస్తుత తరుణంలో వరల్డ్ విజన్ వంటి సేవా సంస్థలు విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తూ ప్రోత్సహించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కృష్ణ, విజయ్‌కుమార్, మాలోజు రవి, ప్రకాష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.

ప్రజావాణిలో ఏడు ఫిర్యాదులు



ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న సీపీ ప్రసాదరావు

ఎల్‌బీనగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఏడు ఫిర్యాదులు వచ్చాయి. సోమవారం జీహెచ్‌ఎంసీ కౌన్సిల్ సమావేశం ఉండటంతో జోనల్ కమిషనర్ పంకజ ఆ సమావేశానికి వెళ్లాల్సి రావడంతో జోనల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో సీపీ ప్రసాదరావు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రజలు చేసిన ఫిర్యాదుల్లో పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించినవి మూడు, శానిటేషన్‌కు సంబంధించినవి రెండు, జలమండలి, ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించినవి ఒకొక్కటి ఉన్నాయని సీపీ తెలిపారు.

పార్కు స్థలం కబ్జాపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అబ్దుల్లాపూర్‌మెట్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్ మున్సిపాలిటీ 9వ వార్డు లక్ష్మారెడ్డిపాలెంలోని లుంబిని హిల్స్‌లో పార్కు స్థలం కబ్జాపై సోమవారం లుంబిని హిల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్. కృష్ణారెడ్డి రంగారెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. లుంబిని హిల్స్ కాలనీలో ప్రజా అవసరాల కోసం ఆరు చోట్ల స్థలాలను కేటాయించినట్లు తెలిపారు. ఆయా స్థలాలను కాలనీవాసులు వివిధ ప్రజా అవసరాల కోసం వినియోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. అందులో ఒక చోట మున్సిపాలిటీ ఆధ్వర్యంలో హరితహారం మొక్కలు నాటి పార్కును అభివృద్ధి చేసినట్లు తెలిపారు. కాలనీలవాసులు సేదతీరేలా బెంచీలతో పాటు పార్కు చుట్టు కంచెను ఏర్పాటు చేసినట్లు కలెక్టర్‌కు తెలిపారు. అయితే కొద్ది రోజుల క్రితం పార్కు పక్కనే ఉన్న ఓ ఇంటి యజమాని కంచెతో పాటు మొక్కలను ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఈ విషయాన్ని మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వివరించారు. పార్కు కబ్జాను అడ్డుకుని రక్షణ చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. పార్కును ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

అఫిలియేషన్ దరఖాస్తుకు గడువు పొడిగింపు

● ఉత్తర్వులు జారీచేసిన జేఎన్‌టీయూ రిజిస్ట్రార్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

హైదరాబాద్ సిటీ : జేఎన్‌టీయూ అఫిలియేషన్ కోసం దరఖాస్తు గడువును పొడిగిస్తూ రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ నెల 18వ తేదీలోగా దరఖాస్తులు సమర్పించని ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీలకు వందశాతం జరిమానా విధిస్తామని ఆదేశించడంపై.. జేఎన్‌టీయూలో అఫిలియేషన్ దందా..! శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి జేఎన్‌టీయూ అధికారులు స్పందించారు. ఎటువంటి జరిమానా చెల్లించాల్సిన అవసరం లేకుండా సోమ, మంగళవారాల్లోనూ దరఖాస్తులు సమర్పించవచ్చని రిజిస్ట్రార్ విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రేపటి నుంచి ప్రైవేట్ కాలేజీల యాజమాన్యాలతో సమావేశాలు

వర్సిటీ అధికారులు ఏకపక్షంగా తీసుకుంటున్న నిర్ణయాలపై ప్రైవేటు కళాశాలల నుంచి తీవ్ర స్థాయిలో అభ్యంతరం వ్యక్తం కావడంతో.. యాజమాన్యాలను బుజ్జగించేందుకు బుధవారం నుంచి మూడు రోజులపాటు జేఎన్‌టీయూలో సమావేశాలు నిర్వహించనున్నారు. 21న అటానమస్, 22న నాన్-అటానమస్, 23న ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల యాజమాన్యాలతో వీసీ, రిజిస్ట్రార్, రెక్టార్, అకడమిక్ ఆడిట్ సెల్ అధికారులు సంప్రదింపులు జరపనున్నారు. యాజమాన్యాలతో మీటింగ్స్ షెడ్యూలును అన్ని అఫిలియేటెడ్ కళాశాలలకు రిజిస్ట్రార్ సర్క్యులేట్ చేశారు.

కానిస్టేబుల్ బ్రెయిన్‌డెడ్

● అవయవాలు సేకరించిన జీవన్‌దాన్ సంస్థ సభ్యులు

మన్సూరాబాద్: బ్రెయిన్‌డెడ్ అయిన ఓ కానిస్టేబుల్ తాను చనిపోతూ నలుగురికి ప్రాణం పోశారు. ఇబ్రహీంపట్నం మండలం, పొల్కంపల్లి సమీపంలోని నాగంపల్లికి చెందిన మేకల శ్యాసుందర్(41) ఎల్‌బీనగర్ పీఎస్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. జనవరి 27న ఇంట్లో కిందపడడంతో స్పృహ కోల్పోయాడు. కుటుంబ సభ్యులు అతడిని ఎల్‌బీనగర్‌లోని కామినేని ఆస్పత్రికి తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్నప్పటికీ ఆరోగ్యం మెరుగుపడలేదు. శ్యాంసుందర్ బ్రెయిన్‌డెడ్ అయినట్లు వైద్యులు ఆదివారం ప్రకటించారు. జీవన్‌దాన్ సంస్థ ప్రతినిధులు కుటుంబ సభ్యులతో మాట్లాడి అవయవదానంపై అవగాహన కల్పించారు. వారు అంగీకరించడంతో అతడి శరీరం నుంచి లివర్, కంటి శుక్లాలు సేకరించారు.

రాచకొండలో ఇన్‌స్పెక్టర్‌లు, ఎస్‌ఐల బదిలీ

● హైదరాబాద్ కమిషనరేట్‌లో 38 మంది కానిస్టేబుళ్లు..

హైదరాబాద్‌సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న 8మంది ఇన్‌స్పెక్టర్లు, నలుగురు సబ్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ తరుణ్‌జోషి ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన అధికారులు వెం టనే బాధ్యతలు స్వీకరించాలని ఆదేశించారు. హయత్‌నగర్ ఎస్‌హెచ్‌ఓగా జి.రామకృష్ణ, హయత్‌నగర్ డీఐగా జి.రుద్వీర్‌కుమార్, ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓగా వి.సైదిరెడ్డి, బాలాపూర్ ఎస్‌హెచ్‌ఓగా టి.భూపతి, డి.యాలాద్రి స్పెషల్ బ్రాంచికి, ఎన్.అశోక్, ఉప్పల్ ట్రాఫిక్-1 ఇన్‌స్పెక్టర్‌గా ఇ.వెంకటరెడ్డి, ఉప్పల్ ట్రాఫిక్-2 ఇన్‌స్పెక్టర్‌గా ఎ.సూర్యనాయక్ బదిలీ అయ్యారు. ఎస్‌ఐలు కె.రాఘవేంద్రగౌడ్ చౌటుప్పల్ పీఎస్‌కు, పి.మల్లయ్య రామన్నపేట్ ఎస్‌హెచ్‌ఓగా, హెచ్.రాఘవేందర్ స్పెషల్ బ్రాంచికి, నారాయణపూర్ ఎస్‌హెచ్‌ఓగా జె.జగన్ బదిలీ అయ్యారు. హైదరాబాద్ కమిషనరేట్‌లో వివిధ పోలీస్‌స్టేషన్లలో విధుల నిర్వహిస్తున్న 38 కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ పోలీస్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

అప్పుడే పుట్టిన ఆవు దూడపై వీధి కుక్కల దాడి

● ప్రాణాపాయ స్థితిలో దూడ

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి) : అప్పుడే పుట్టిన ఆవు దూడపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన సోమవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. గాయపడిన ఆవు దూడ కొనప్రాణంతో కొట్టు మిట్టాడుతోంది. వివరాల ప్రకారం.. హయత్‌నగర్ డివిజన్‌లోని భాగ్యలత అరుణోదయ కాలనీ మాజీ అధ్యక్షుడు బద్దం మధుసూదన్‌రెడ్డి గిరి జాతి ఆవును కాలనీలోని రోడ్డు నంబర్ 3లో ఇంటి వద్దనే షెడ్డు వేసి సాకుతున్నాడు. ఆవు సోమవారం తెల్లవారు జామున 4గంటలకు ప్రసవించింది. ఆ సమయంలో ఎవరూ అక్కడ లేకపోవడంతో దాదాపు 10 నుంచి 15 వీధి కుక్కలు అప్పుడే పుట్టిన దూడపై దాడి చేశాయి. దూడ కుడి వైపు తొడను పీక్కు తిన్నాయి. ఆవు అరుపులు విన్న మధుసూదన్‌రెడ్డి వెంటనే షెడ్డు వద్దకు రాగానే వీధి కుక్కలు పారిపోయాయి. ఎంతో ఇష్టంతో పెంచుకున్న ఆవుకు పుట్టిన దూడకు అయిన గాయాన్ని చూసి మధుసూదన్‌రెడ్డి కుటుంబ సభ్యులు కంటతడి పెట్టారు. వెంటనే హయత్‌నగర్‌లోని పశువుల ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఆవు దూడ కొన ప్రాణంతో కొట్టు మిట్టాడుతోంది.

ఘనంగా శివాజీ జయంతి

సరూర్‌నగర్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): ఛత్రపతి శివాజీ మహారాజ్ ధైర్య సాహసాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని రాష్ట్ర మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. శివాజీ జయంతి వేడుకలను పురస్కరించుకుని సోమవారం మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని జిల్లెలగూడ చందచెరువు కట్ట మీద గల శివాజీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌లో..

బడంగ్‌పేట్ చౌరస్తాలో యూత్ కాంగ్రెస్ నాయకుడు దయారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శివాజీ జయంతి వేడుకల్లో మేయర్ పారిజాతానర్సింహారెడ్డి పాల్గొని ఆయన ఫ్లెక్సీకి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్థానిక ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. అల్మాస్‌గూడలోని కోమటికుంట చెరువు వద్ద గల శివాజీ విగ్రహం వద్ద, బాలాపూర్‌లోని శివాజీ చౌక్ వద్ద నిర్వహించిన శివాజీ జయంతి ఉత్సవాల్లోనూ మేయర్ పారిజాతారెడ్డి పాల్గొని నివాళులర్పించారు.

మీర్‌పేట్‌లో..

మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని శివాజీనగర్ కాలనీలో గల శివాజీ విగ్రహం వద్ద బీజేపీ అధ్యక్షుడు పెండ్యాల నర్సింహ ఆధ్వర్యంలో నిర్వహించిన జయంతి వేడుకల్లో పలువురు కార్పొరేటర్లు, బీజేపీ నాయకులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.

ఎల్బీనగర్ : ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని సిరీనగర్‌కాలనీలో గణేష్ మహారాజ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో యూత్ ప్రతినిధులు పాల్గొన్నారు.



శోభాయాత్రలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ, బీజేవైఎం అదనపు కార్యదర్శి రమణ్‌సింగ్

మన్సూరాబాద్, నాగోల్‌లలో..

మన్సూరాబాద్: మన్సూరాబాద్, నాగోల్ డివిజన్లలోని వివిధ పార్టీల నాయకులు శివాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. పలు చోట్ల ర్యాలీలు తీశారు. నాగోల్ డివిజన్‌లో నిర్వహించిన శివాజీ జయంతి ర్యాలీలో కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్, తెలంగాణ టూరిజం కార్పొరేషన్ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పాల్గొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ జడ్జస్ కాలనీలోని శివాజీ విగ్రహానికి కాంగ్రెస్ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్దగోని లక్ష్మీప్రసన్న హాజరై నివాళులర్పించారు.

సైదాబాద్ : సైదాబాద్‌లో బీజేవైఎం రాష్ట్ర అదనపు కార్యదర్శి రమణ్ సింగ్ ఆధ్వర్యంలో శోభాయాత్ర నిర్వహించారు. సైదాబాద్ బస్తీ నుంచి సరూర్‌నగర్ శివాజీ విగ్రహం వరకు భారీ బైక్ ర్యాలీతో యాత్ర కొనసాగింది. కార్యక్రమంలో కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి, నగర మాజీ డిప్యూటీ మేయర్ సుభాష్‌చందర్జీ పాల్గొన్నారు.



జిల్లెలగూడలో శివాజీ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే సబితారెడ్డి



బడంగ్‌పేట్ చౌరస్తాలో శివాజీ జయంతి వేడుకల్లో మేయర్ పారిజాతారెడ్డి, కార్పొరేటర్లు

గ్రేటర్ బడ్జెట్ రూ.7,937 కోట్లు

● ప్రస్తుతంతో పోలిస్తే రూ.1,713 కోట్లు అధికం ● నేడు కౌన్సిల్‌లో చర్చ ● ఆమోదం అనంతరం ప్రభుత్వానికి

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): జీహెచ్‌ఎంసీ బడ్జెట్ భారీగా పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ప్రతిపాదించిన బడ్జెట్‌తో పోలిస్తే 2024-25 పద్దును రూ.1,713 కోట్లు పెంచుతూ.. రూ.7,937 కోట్లతో బడ్జెట్ ప్రతిపాదనలు రూపొందించారు. 2023-24 సవరణ బడ్జెట్ మాత్రం రూ.6,990 కోట్లుగా చూపారు. మొదటిసారి జీహెచ్‌ఎంసీ చేసిన అప్పులకు సంబంధించిన వాయిదాలు, వడ్డీలకోసం రూ.1200 కోట్లు ప్రభుత్వం నుంచి వస్తుందని ఆశిస్తున్నారు. బడ్జెట్ పెరుగుదలకు ఇది ప్రధాన కారణం కాగా.. మ్యుటేషన్ రుసుము ప్రస్తుతం రూ.10 కోట్లు ఉండగా దానిని రూ.200 కోట్లకు పెంచారు. ప్రభుత్వం నుంచి ఇతర రూపాల్లో వచ్చే ఆదాయమూ రూ.300 కోట్లకుపైగా పెరుగుతుందని ప్రతిపాదనల్లో చూపించారు. ఆస్తిపన్ను, పట్టణ ప్రణాళికా విభాగాల ఆదాయం రూ.100 కోట్ల నుంచి రూ.150 కోట్లు పెరిగే అవకాశముందని పేర్కొన్నారు. వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఆర్‌డీపీ), వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్‌ఎన్‌డీపీ), కాంప్రహెన్సివ్ రోడ్ మెయింటెనెన్స్ ప్రోగ్రామ్ (సీఆర్‌ఎంపీ)ల కోసం రూ.6,500 కోట్లకుపైగా అప్పు చేసిన నేపథ్యంలో ఆ రుణానికి ప్రతినెలా వడ్డీ, అసలు కలిపి నెలకు రూ.100 కోట్లు చెల్లించాల్సి ఉంది. వాస్తవంగా ఆయా పనులు ప్రభుత్వం చేయాల్సి ఉండడం.. గత సర్కారు ఆదేశాల మేరకు అప్పు తీసుకొని చేసిన దృష్ట్యా.. ఆ మొత్తం ప్రభుత్వం ఇవ్వాలనే బడ్జెట్‌లో ప్రతిపాదించినట్లు ఓ అధికారి చెప్పారు. నేడు జరుగనున్న సమావేశంలో మొదటి సెషన్‌లో ప్రశ్నోత్తరాలపై, రెండో సెషన్‌లో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బడ్జెట్‌పై చర్చించనున్నారు. ఆమోదం అనంతరం పద్దును ప్రభుత్వానికి పంపనున్నారు.

బడ్జెట్ సంక్షిప్త స్వరూపం..

రెవెన్యూ ఆదాయం(రూ.కోట్లలో)..

- ఆస్తిపన్ను - రూ.1907 కోట్లు
- టౌన్‌ప్లానింగ్ - 1600
- ప్రభుత్వం నుంచి - 785
- మ్యుటేషన్ రుసుము - 200
- ట్రేడ్ లైసెన్స్ - 110
- ప్రకటనలు - 20
- ఎస్టేట్ - 10
- రుణ చెల్లింపునకు ప్రభుత్వం నుంచి నిధులు - 1200
- ఇతరత్రా- 106

మొత్తం- 5938

మూలధన ఆదాయం (రూ.కోట్లలో)...

- 15వ ఫైనాన్స్ కమిషన్ - 350
- టీడీఆర్ - 300
- ఇతర గ్రాంట్లు - 11
- డిపాజిట్ వర్క్ రశీదులు - 8
- ఇతరత్రా రశీదులు - 2
- రుణం- 128
- ప్రభుత్వం నుంచి గ్రాంట్లు - 1200

మొత్తం- 1999

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): తుర్కయంజాల్ మున్సిపాలిటీని జిల్లాలోనే ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి తన వంతు కృషి చేస్తానని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. సోమవారం ఆయన తుర్కయంజాల్ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధతో కలిసి రూ.4కోట్ల62లక్షలతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. మున్సిపాలిటీలోని కమ్మగూడ, తుర్కయంజాల్‌లోని వార్డు నంబర్ 18, 19, 22, 23లలో సీసీ రోడ్లు, పార్కుల అభివృద్ధి, బీటీ రోడ్లు, కమ్యూనిటీహాల్‌ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుర్కయంజాల్ మున్సిపాలిటీ అభివృద్ధికి కట్టుబడి ఉన్నట్లు స్పష్టం చేశారు. మున్సిపాలిటీలో ప్రధాన సమస్యలపై దృష్టి సారించి అభివృద్ధికి పునాదులు వేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్‌పర్సన్ హరిత, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ కౌన్సిలర్ కొశిక ఐలయ్య, కమిషనర్ సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు కళ్యాణ్‌నాయక్, మంగమ్మ, కవితా శేఖర్‌గౌడ్, ఉదయశ్రీ, అనురాధ, సునీల్, భాగ్యమ్మ పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రంగారెడ్డి

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ

సరూర్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బడంగ్‌పేట్ కార్పొరేషన్‌లోని బాలాపూర్ ఎస్‌పీఆర్ గార్డెన్స్‌లో నూతనంగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో సోమవారం వేద పండితుల మంత్రోచ్ఛరణల నడుమ అభయాంజనేయస్వామి విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. హంపి పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతీ మహాస్వామి కరకమలముల చేత ఈ మహాకార్యాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అయోధ్యలో కొలువైన బాలరాముడి విగ్రహాన్ని తయారు చేసిన కృష్ణ శిలతోనే ఇక్కడి హనుమాన్ విగ్రహాన్ని తయారు చేయడం విశేషమని ఆయన వ్యాఖ్యానించారు. సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త సామల రంగారెడ్డి ఆధ్వర్యంలో జరిగిన వివిధ ఆధ్యాత్మిక భక్తి కార్యక్రమాల్లో మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగిరింత పారిజాతానర్సింహారెడ్డి, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొలన్ శంకర్‌రెడ్డి, సినీ, టీవీ నటులు అనసూయ, ఆకాశ్‌పూరి, అను రావిపూడి, బడంగ్‌పేట్ కౌన్సిల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్‌రెడ్డి, కార్పొరేటర్లు బండారి మనోహర్, ఎర్ర మహేశ్వరీజైహింద్‌కుమార్ పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠలో విద్యారణ్య భారతీస్వామీజీ

సంత్ సేవాలాల్ జయంతి

చంపాపేట, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హస్తినాపురం డివిజన్‌లోని కాటం పార్వతమ్మ కాలనీలోని పార్కులో సోమవారం బంజారా జనతా సంఘం, ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భిక్షపతినాయక్ ఆధ్వర్యంలో సంత్‌సేవాలాల్ మహారాజ్ 285వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఐఏఎస్ అధికారి భారతి లక్పతినాయక్ హాజరై సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించి భోగ్ బండార్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌నాయక్, జానకీరాంనాయక్, శ్రీరాంనాయక్, ధంజీలాల్ నాయక్, వసురాంనాయక్, కృష్ణనాయక్, పాండునాయక్, బిక్కునాయక్, కిషన్‌నాయక్ పాల్గొన్నారు.

పది పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలి

● ఎంఈఓ కృష్ణయ్య

చంపాపేట, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షలలో ఉత్తమ ఫలితాలు సాధించాలని సరూర్‌నగర్ ఎంఈఓ కృష్ణయ్య కోరారు. చంపాపేటలోని మంద యాదవరెడ్డి గార్డెన్‌లో సోమవారం రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో సరూర్‌నగర్, బాలాపూర్ మండలాలకు చెందిన 12వందల మంది 10వ తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంఈఓ హాజరై మాట్లాడుతూ వార్షిక పరీక్షలకు విద్యార్థులు సన్నద్ధం కావాలని, పాఠ్యాంశాలను కష్టంతో కాకుండా ఇష్టంతో చదువాలని కోరారు. పరీక్షలలో ప్రతి విద్యార్థి 10/10జీపీఏ సాధించాలని కోరారు. ప్రముఖ సైకాలజిస్ట్ శ్రీనివాస్, పీఆర్‌టీయూ టీఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కన్నయ్య గారి గోవర్ధన్‌యాదవ్, కళాకారుడు దాసు విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మంచిరెడ్డి అనంతరెడ్డి, నారాయణగౌడ్, రాజేశ్వర్‌రెడ్డి, నవీన్, మధుకర్‌రెడ్డి, విజయసాగర్, గిరిధర్, అర్జున్, అరుణ్, రామార్జున్‌రెడ్డి, శ్రీనివాస్, సురేష్‌కుమార్, ప్రకాష్, స్వర్ణలత, కాశీరావు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

'క్రీడా'లో కిసాన్ మేళా

హయత్‌నగర్, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): హయత్‌నగర్‌లోని కేంద్రీయ మెట్ట వ్యవసాయ పరిశోధన సంస్థ, రంగారెడ్డి జిల్లా కృషి విజ్ఞాన కేంద్రం(క్రీడా)లో సోమవారం అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై కిసాన్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నాగ్‌పూర్‌కు చెందిన పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వైజీ ప్రసాద్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు అధిక సాంద్రత పద్ధతిలో పత్తిని సాగు చేయడం వల్ల నాణ్యమైన అధిక దిగుబడులు వస్తాయన్నారు. దీని వల్ల యాంత్రీకరణ, కలుపు యాజమాన్యం, పోషకాల యాజమాన్యం సులువుగా ఉంటుందన్నారు. కేవీకే ద్వారా కేంద్ర ప్రభుత్వం రైతులకు అనేక రకాలుగా సహకారం అందిస్తుందన్నారు. ఈ సందర్భంగా క్రీడా డైరెక్టర్ ఎం. శ్రీనివాసరావు మాట్లాడుతూ శాస్త్రవేత్తలు రైతులకు సకాలంలో సూచనలు, సలహాలు అందించినట్లయితే నష్టాన్ని తగ్గించే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి గీత, వ్యవసాయ శాస్త్రవేత్తలు రమణ, సంజీవరెడ్డి, వాణి, విజయ్‌కుమార్, సుధీర్, శ్రీకృష్ణ, రామకృష్ణ, సుదర్శన్‌రెడ్డి, సునీత, సాయివర్ధన్, రైతులు, అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాగ్‌పూర్ పత్తి పరిశోధన సంస్థ డైరెక్టర్ వైజీ ప్రసాద్

బుక్ ఫెయిర్ అధ్యక్షుడిది పురుషాహంకార ధోరణి

● సభను జరగనీయలేదని స్త్రీవాద రచయిత్రులు ఆగ్రహం

● నిరసనగా స్టాల్ వద్ద ప్రత్యేక సమావేశం

● ట్రాన్స్ మహిళను పిలిచి అవమానించారని విమర్శలు

● అధ్యక్షుడి తీరు సరికాదన్న సామాజిక ఉద్యమకారులు



మాట్లాడుతున్న రచన ముద్రబోయిన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): బుక్ ఫెయిర్ అధ్యక్షుడి పురుషాహంకార ధోరణికి నిదర్శనం స్త్రీ వాద రచయిత్రుల సభను జరగనీయకపోవడం అంటూ రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు నిరసించారు. అధ్యక్షుడి తీరును వ్యతిరేకిస్తూ సోమవారం స్టాల్ నెంబరు 205 వద్ద రచయిత్రి సజయ నేతృత్వంలో స్త్రీవాద రచయిత్రులు, సామాజిక ఉద్యమకారులు పలువురు సమావేశం నిర్వహించారు. భిన్న నేపథ్యాలకు చెందిన రచయిత్రులతో 'స్త్రీ వాద రచయిత్రులు - వర్తమాన సవాళ్ళు' అంశంపై ఆదివారం తాము నిర్వహించ తలబెట్టిన చర్చాగోష్ఠిని సమయం లేదంటూ బుక్ ఫెయిర్ అధ్యక్షుడు అడ్డుకున్నారని పలువురు రచయిత్రులు, సామాజిక కార్యకర్తలు విమర్శించారు. ఇది మహిళల పట్ల వారికున్న వివక్షకు నిదర్శనమని అన్నారు. బుక్ ఫెయిర్ నిర్వహణ కమిటీలో మహిళల భాగస్వామ్యం లేకపోవడాన్ని ప్రశ్నించారు. ట్రాన్స్ మహిళ రచన ముద్రబోయిన, ఓ వైపు చెత్త సేకరిస్తూ, డిగ్రీ చదువుతున్న వర్ధమాన రచయిత్రి జయలక్ష్మి, ఒంటరి స్త్రీలపై కథా సంపుటి వెలువరించిన విజయ భండారు, సైబర్ సెక్యూరిటీ రంగంలో పనిచేస్తూ రచనలు చేస్తోన్న పూర్ణిమ తమ్మిరెడ్డి, విప్లవోద్యమంలోని మహిళల కథలను సంకలనం చేసిన అనూరాధ, అపర్ణ తోట, మెర్సీ మార్గరెట్, సాత్విక నన్నెబోయిన, దాసోజు లలిత తదితరులు చర్చా గోష్ఠిలో మాట్లాడాలి అనుకున్న అంశాలను ప్రస్తావించారు. స్త్రీల రచనలకు సంబంధించిన సమావేశాన్ని చివరి నిమిషంలో రద్దు చేయడం అన్యాయమని ఆక్షేపించారు. వీరికి సంఘీభావంగా విజయ్ వంగల పూడి, ఆర్. భరద్వాజ తదితరులు మాట్లాడారు.

వేదికపై వాగ్వివాదం

'స్త్రీవాద రచయిత్రులు వర్తమాన సవాళ్లు' సదస్సును చివరి నిమిషంలో రద్దు చేసి విమర్శల పాలైన బుక్ ఫెయిర్ నిర్వాహకులు, ఆ పొరపాటును సరిదిద్దుకొనేందుకు ట్రాన్స్ మహిళా రచయిత్రి, ఉద్యమ కారిణి రచన ముద్రబోయినను ముగింపు సమావేశానికి ఆహ్వానించారు. రచనతో మాట్లాడించాలని కార్యనిర్వాహక సభ్యుడు బాల్‌రెడ్డి సూచించగా.. ఎవర్ని అడిగి ఆమెను పిలిచారంటూ అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్ మండిపడ్డారు. ఈ విషయంలో వేదికపై మంత్రి పొన్న ప్రభాకర్ సమక్షంలో వాగ్వివాదం జరిగింది. మంత్రి జోక్యం చేసుకొని రచన ముద్రబోయినతో మాట్లాడించాలని సభాధ్యక్షుడిని ఆదేశించగా.. గొడవ సద్దుమణిగింది. స్త్రీవాద రచయిత్రుల సదస్సు చివరి నిమిషంలో రద్దవడంపట్ల బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్ విచారం వ్యక్తం చేశారు.

సమాజానికి మార్గనిర్దేశం చేసే రచనలు రావాలి

● మంత్రి పొన్నం ప్రభాకర్

● ముగిసిన హైదరాబాద్ పుస్తక ప్రదర్శన

హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 19 (ఆంధ్రజ్యోతి): భావితరాలకు మార్గానిర్దేశం చేసేలా మేధావులు, విద్యావంతులు రచనలు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చే శారు. భిన్న భావజాలాలు, విభిన్న దృక్పథాలకు సంబంధించిన పుస్తకాలన్నీ ఒకచోట ఉండటం, పుస్తక మహోత్సవ ప్రాంగణాన్ని చూస్తుంటే ఆనందంగా ఉందన్నారు. సోమవా రం ఎన్టీఆర్ స్టేడియంలో 36వ హైదరాబాద్ జాతీయ పుస్త క మహోత్సవ ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న మంత్రి మాట్లాడుతూ.. బుక్ ఫెయిర్ నిర్వహణకు మౌలిక సదుపాయాలు కల్పించేందుకు హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా తాను ప్రత్యేక చొరవ తీసుకుంటాన్నారు. ఎన్టీఆర్ స్టేడియంలో శాశ్వత మరుగుదొడ్లు నిర్మిస్తామని వాగ్దానం చేశారు. పిల్లలకు పుస్తక పఠనాభిరుచిని పరిచయం చేసే విధంగా తల్లిదండ్రులు ప్రయత్నించాలని సూచించారు. ఆలోచనలను విస్తృతం చేసుకోవాలన్నా, సమాజాన్ని అర్థం చేసుకోవాలన్నా పుస్తకమే ఆధారమని అన్నారు. యువత చెడు వ్యసనాలకు లోను కాకుండా, వ్యక్తిత్వాన్ని మలచుకోవడానికి పుస్తకాలను ఆశ్రయించాలని హితవుపలికారు. సామాజిక మార్పునకు దోహదపడంతోపాటు సామాజిక చైతన్యాన్ని పెంపొందించే దిశగా రచనలు చేయడం కవులు, రచయితల బాధ్యత అని అన్నారు. వర్తమానాన్ని విశ్లేషిస్తూ, భవిష్యత్తుకు బాట చూపే ఆశావాహ రచనలు రావాలని ఆకాంక్షించారు. ప్రముఖ సామాజికవేత్త ప్రొఫెసర్ రమా మేల్కొటే మాట్లాడుతూ భారతదేశ చరిత్ర, తెలంగాణ చరిత్ర లను వక్రీకరిస్తున్న ప్రస్తుత సందర్భంలో వాస్తవాలు పునాదిగా లిఖించబడిన చరిత్ర పుస్తకాలు చదివి అబద్ధాల చరిత్రను తిప్పికొట్టాలని పాఠకులకు సూచించారు. ట్రాన్స్ మహి ళ రచన ముద్రబోయిన మాట్లాడుతూ.. సమాజంలో ట్రాన్స్ వ్యక్తుల పట్ల ఉన్న వివక్షకు వ్యతిరేకంగా తమ జీవితాలు ఇతివృత్తంగా మరిన్ని రచనలు రావాలని, అందుకు రచయితలు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కోరారు. ప్రముఖ కవి కె. శివారెడ్డి మాట్లాడుతూ.. ప్రపంచాన్ని చూపించింది, పరిచయం చేసిందీ పుస్తకమే అని అన్నారు. ఓయూ వీసీ రవీందర్, తె లంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, బుక్ ఫెయిర్ కార్యదర్శి ఆర్. శ్రీనివాస్, అధ్యక్షుడు జూలూరు గౌరీశంకర్, కవి యాకూబ్, బాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన కౌన్సిలర్ కవిత

హయత్‌నగర్ : తుర్కయంజాల్ మున్సిపాలిటీ 19వ వార్డు కౌన్సిలర్ నారని కవిత శేఖర్‌గౌడ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షురాలు కొత్త కుర్మ మంగమ్మ శివకుమార్ సమక్షంలో కవిత పార్టీలో చేరారు. ఈ సందర్భంగా మంగమ్మ కవితకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.